సాక్షి విశాఖపట్నం

శనివారం । 31 । మే । 2025



పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం 10లో



ఉపాధి మార్గాల ద్వారా ఆర్థిక స్వావలంబన 10లో



పొగ.. జీవితాలకు సెగ 10లో

అంతర్జాతీయ మోడలింగ్‌లో మెరిసిన విశాఖ చిన్నారి



అక్కిరెడ్డిపాలెం: శ్రీలానగర్‌లోని బీవీకే స్కూల్‌లో మూడో తరగతి చదువుతున్న జినిషా అలికానా 'సూపర్ గ్లో జూనియర్ మోడల్ ఇంటర్నేషనల్'గా ఎంపికైంది. ఈమె తండ్రి రాంబాబు అలికానా ఎయిర్ ఇండియాలో సెక్యూరిటీ ఆఫీసర్‌గా పనిచేస్తుండగా, తల్లి కావ్య గృహిణి. జినిషా మొదటిసారిగా గాజువాకలో జరిగిన మెస్సీ ఈవెంట్‌లో తన ప్రతిభతో అందరినీ ఆకట్టుకుంది. ఆ తర్వాత గోవాలో జరిగిన కార్యక్రమంలో 54 మంది పోటీదారుల్లో రెండో స్థానంలో నిలిచి తన సత్తా చాటింది.





సంద్రంలో సీతాకోకచిలుకలు

ఆశలు రేకెత్తించే వర్షం.. మేఘాలతో నిండిన విశాఖ తీరం.. ఈసారి పర్యాటకులను అద్భుతమైన దృశ్యంతో ఆకట్టుకుంది. సంద్రంలో అలలు తాకుతుంటే, సంప్రదాయ పడవలు ఒకదాని వెనుక ఒకటి కదులుతూ, వర్ణరంజితమైన సీతాకోకచిలుకల సమూహాన్ని తలపించాయి. ఆకాశంలో మేఘాలు, నీటిలో పడవలు సృష్టించిన ఈ కమనీయ దృశ్యం కోస్టల్ బ్యాటరి వద్ద పర్యాటకులను మంత్రముగ్ధులను చేసింది. వారి మనసులను ఆనందంతో నింపింది.

-ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



మద్దిలపాలెం జాతీయ రహదారిలో భారీ వర్షంలో వాహనదారుల ఇక్కట్లు



దంచి కొట్టిన వాన

పగలంతా ఎండ.. సాయంత్రం హోరు వాన

మహారాణిపేట: పగలంతా ఎండ.. సాయంత్రానికి ఒక్కసారిగా మారిన వాతావరణం. ఆకాశం మబ్బులు పట్టి ఈదురుగాలులతో భారీ వర్షం. ఇదీ విశాఖలో శుక్రవారం నాటి వాతావరణ పరిస్థితి. దాదాపు 40 నిముషాల పాటు వర్షం కురిసింది. రోడ్లు, కాలువలు ముంచెత్తాయి. లోతట్టు ప్రాంతాల్లో మోకాల్లోతున వాన నీరు నిలిచింది. గత కొద్ది రోజులుగా ఉదయం పూట ఎండల తీవ్రత, గాలిలో అధిక తేమ కారణంగా విశాఖ వాసులు తీవ్ర ఉక్కపోతకు గురయ్యారు. తాజా వర్షం ఉపశమనాన్నిచ్చింది. బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం, నైరుతి రుతుపవనాల విస్తరణ కారణంగా వర్షాలు పడుతున్నాయని వాతావరణ శాఖాధికారులు చెబుతున్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

ఈదురు గాలులతో కూడిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రైల్వే స్టేషన్ రోడ్డు, డాబాగార్డెన్స్, రైల్వే న్యూకాలనీ, ఆశీలమెట్ట, దొండపర్తి, చావులమదుం, అక్కయ్యపాలెం, వెలంపేట, పూర్ణామార్కెట్, ఆశీలమెట్ట, కంచరపాలెం, ఎన్ఏడీ కొత్తరోడ్డు, పాత పోస్టాఫీసు తదితర ప్రాంతాల్లో భారీగా వర్షం కురిసింది. చావులమదుం బ్రిడ్జి వద్ద వర్షపు నీరు అధికంగా చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ద్విచక్రవాహనాలు కూడా వర్షపు నీటిలో చిక్కుకున్నాయి. రైల్వే స్టేషన్ రోడ్డులో కూడా వర్షపు నీరు భారీగా చేరింది.



రైల్వే స్టేషన్ వద్ద






ప్రస్తుతం రుషికొండ బ్లూఫ్లాగ్ బీచ్ దుస్థితి

ప్రపంచస్థాయి బీచ్‌గా ప్రసిద్ధి చెందిన రుషికొండ బ్లూఫ్లాగ్‌పై కూటమి గద్దల కన్నుపడింది. నిర్వహణ పేరుతో అందినకాడికి దోచుకునేందుకు భీమిలికి చెందిన జనసేన నాయకుడు 'పంచ'తంత్రం రచించాడు.ఓ అండ్ ఎం టెండర్ల పేరుతో బ్లూఫ్లాగ్ బీచ్‌ను తన గుప్పిట్లో పెట్టుకునేందుకుసిద్ధమయ్యాడు. ఇందుకు పర్యాటక శాఖ 'ప్రాంతీయ'అధికారుల సహకారం తోడైంది.

-సాక్షి, విశాఖపట్నం



రుషికొండ బ్లూఫ్లాగ్ బీచ్

'బ్లూ ఫ్లాగ్ బీచ్‌లో పంచతంత్రం

బ్లూఫ్లాగ్ బీచ్‌పై భీమిలి జనసేన నేత కన్ను • రుషికొండ బీచ్ నిర్వహణకు టెండర్ల ఆహ్వానం • అధికారుల అండతో దోపిడీకి రంగం సిద్ధం?

రుషికొండ సాగరతీరం 2020 అక్టోబర్ 11న 'బ్లూఫ్లాగ్' గుర్తింపు పొందింది. ఈ **నేపథ్యంలో రుషికొండ బీచ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.7.35 కోట్లను కేటాయించింది. ఈ** నిధులతో అప్పటి ప్రభు**త్వం వివిధ పనులు చేపట్టి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది. ఏటా జ్యూరీ సభ్యులు బీచ్‌ను** పరిశీలించి, ఈ ధ్రు**వీకరణ పత్రాన్ని పునరుద్ధరిస్తారు.** 2023 వరకు సుందరంగా కనిపించిన బీచ్.. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 'బ్లూ ఫ్రాడ్'గా మారిపోయింది. ఇది అంతర్జాతీయ బీచ్ అనే విషయాన్ని కూడా మర్చిపోయింది. దీంతో డెన్మార్క్ సంస్థ రుషికొండ బీచ్‌కు ప్రపంచస్థాయి గుర్తింపును తాత్కాలికంగా రద్దు చేయడతో కూటమి సర్కారు ఉలిక్కిపడింది. హడావుడిగా తాత్కాలిక పనులు చేపట్టి.. మళ్లీ సర్టిఫికెట్‌ను పునరుద్ధరించేసుకుంది. ఇప్పుడు ఇదే బీచ్‌ను తమకు కాసులు కురిపించే కేంద్రంగా మార్చేందుకు చకచకా పావులు కదుపుతోంది.

ఓ అండ్ ఎం కోసం టెండర్లు.. కానీ..

తాజాగా ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్(ఓఅండ్ఎం), కాలుష్య నియంత్రణ, రెవెన్యూ సేకరణ కోసం గత నెలలో ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించింది. ఈ ప్రక్రియలోనే జనసేన నాయకుడు చక్రం తిప్పినట్లు ఆరోపణలున్నాయి. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆదే పార్టీకి చెందిన నేత కావడంతో.. ఆయన అండదండలతో విశాఖ రీజియన్ పర్యాటక శాఖను తన గుప్పిట్లోకి తీసుకున్నాడు. దీంతో ఆ నేత అడుగులకు మడుగులొత్తుతూ జిల్లా ఏపీటీడీసీ అధికారులు వ్యవహరిస్తున్నారు. టెండర్లలో పాల్గొనేందుకు ఎవరూ రాకుండా ఉండేలా చూడాలంటూ ఆ నేత హుకుం జారీ చేయడం.. టూరిజంలో 'జగ'మంతా తెలిసిన అధికారి వెంటనే టెండరు నిబంధనలు కఠినతరం చేయడం చకచకా జరిగిపోయాయి.

టెండర్లలో పాల్గొన్నారో.?

ఆర్ఎఫ్‌పీ పిలిచేముందు.. ఆసక్తి కలిగిన సంస్థలతో టూరిజం అధికారులు గత నెలలోనే ఆన్‌లైన్‌లో ప్రీబిడ్డింగ్ మీట్‌ను నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న సంస్థలకు టెండర్ నియమ నిబంధనల గురించి వివరించగా.. కష్టతరంగా ఉన్నాయని, గతంలో ఉన్న నిబంధనలే ఉంచాలని కొందరు కోరారు. ఈ సూచనలను టూరిజం అధికారులు తోసిపుచ్చారు. ఎవరెవరు ఆసక్తిగా ఉన్నారనే వివరాలను **టూరిజం ప్రాంతీయ అధికారులు సేకరించి.. ఆ జాబితాను భీమిలి నేత చేతిలో పెట్టారు. ఇంకేముంది ఆ నేత ఆయా సంస్థల ప్రతినిధులకు ఫోన్లు చేసి బ్లూఫ్లాగ్ టెండర్లలో పాల్గొనవద్దని హెచ్చరికలు జారీ చేసినట్లు సమాచారం. కొందరు ఎదురించి మాట్లాడితే 'ఈ టెండర్‌లో పాల్గొంటే, టూరిజంకి సంబంధించి భవిష్యత్తులో ఏ టెండరూ మీకు రాదు'** అంటూ బెదిరింపులకు పాల్పడినట్లు తెలుస్తోంది. దీంతో వారంతా టెండర్ వేసేందుకు ముందుకు రాలేదు. దీంతో ఆ నేత పాచిక పారింది. త్వరలోనే సెకండ్ కాల్‌కి టెండర్లు ఆహ్వానించి.. తమ అనుయాయులకు అప్పగించేలా అంతా సెట్ చేశాడు. జిల్లా టూరిజం అధికారులు జనసేన నేతకు అనుకూలంగా బ్లూఫ్లాగ్ బీచ్ నిర్వహణ బాధ్యతలు అప్పగించేందుకు యత్నిస్తున్నారే తప్ప.. పర్యాటక శాఖ ఆదాయం, బీచ్ అభివృద్ధి గురించి పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జూలై 9న గిరి ప్రదక్షిణ

ఏర్పాట్లపై దేవస్థానం ఈవో త్రినాథరావు సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం: సింహాచలం క్షేత్రంలో జూలై 9న గిరి ప్రదక్షిణ ఉత్సవం జరగనుందని శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం ఈవో వి. త్రినాథరావు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తామన్నారు. గిరి ప్రదక్షిణ ఉత్సవం నిర్వహణపై శుక్రవారం దేవస్థానం వైదికులు, ఇంజినీరింగ్ అధికారులు, సెక్షన్ హెడ్‌లతో ఈవో ముందస్తు సమీక్ష నిర్వహించారు. జూలై 9న 32 కిలోమీటర్ల సింహగిరి ప్రదక్షిణలో లక్షలాది మంది భక్తులు, అలాగే జూలై 10న ఆలయ ప్రదక్షిణలో వేలాది మంది భక్తులు పాల్గొంటారని ఈవో అంచనా వేశారు.

భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు

భక్తుల సౌకర్యార్థం కొండచుట్టూ స్టాల్స్, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు విషయంపై ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. ఈ ఉత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులకు ముందుగానే లేఖలు రాయాలని సూచించారు. జీవీఎంసీ, పోలీస్, వైద్య ఆరోగ్యశాఖ, ఫైర్, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో త్వరలోనే సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. గిరి ప్రదక్షిణ ఉత్సవంలో దాతల సహకారం కూడా ఎంతో ముఖ్యమని ఈవో పేర్కొన్నారు. పారిశుధ్య నిర్వహణ, విద్యుత్ దీపాలు, మంచినీటి సదుపాయాల కోసం జీవీఎంసీ సహకారం తీసుకుంటామన్నారు. సమావేశంలో స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు కరి సీతారామాచార్యులు, డిప్యూటీ ఈవో ఎస్.రాధ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గీతాంజలి, ఈఈ రాంబాబు, ఏఈవోలు రమణమూర్తి, ఆనంద్‌కుమార్, పిల్లా శ్రీనివాసరావు, పంతం శ్రీనివాసరావు, సూపరింటెండెంట్లు కె.మూర్తి, రాజ్యలక్ష్మి, సునీల్, పద్మనాభరాజు, త్రిమూర్తులు, పీఆర్వో నాయుడు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల నియామకం

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం, యువజన విభాగంలో విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు చెందిన పలువురికి చోటు కల్పించారు. ఆ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం జోనల్ ప్రెసిడెంట్‌గా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రను, రాష్ట్ర యువజన విభాగం జోనల్ ప్రెసిడెంట్‌గా అంబటి నాగ వినాయక శైలేష్ (విశాఖ ఉత్తర)లను నియమించారు. వీరితో పాటురాష్ట్ర యువజన విభాగం అధికార ప్రతినిధిగా మహ్మద్ ఇమ్రాన్ (గాజువాక), రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శులుగా పోలిశెట్టి సురేష్ రాజ్ కుమార్ (పెందుర్తి), కొంగర మురళీకృష్ణ(రంపచోడవరం), రాష్ట్ర యువజన విభాగం సెక్రెటరీగా మలసాల కుమార్ రాజా (అనకాపల్లి), రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శిగా చింతకాయల వరుణ్ (నర్సీపట్నం), మళ్ల శివ (విశాఖ ఉత్తర), ఉడుగు అచ్యుతరామరాజు (పాడేరు)ను నియమించారు. రాష్ట్ర మహిళా విభాగం సెక్రెటరీలుగా బోసు రామలక్ష్మి (విశాఖ ఉత్తర), కోనాల విజయ వినీత (విశాఖ పశ్చిమ), కంచర్ల శ్రీదేవి (గాజువాక), రాష్ట్ర మహిళా విభాగం సంయుక్త సెక్రెటరీలుగా చుక్కా వరలక్ష్మి (విశాఖ పశ్చిమ), బొర్రా విజయలక్ష్మి (విశాఖ దక్షిణ)లను నియమించారు.

కూటమి వైఫల్యాలను ఎండగట్టేందుకు

'4న వెన్నుపోటు దినం'

విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు పిలుపు



మాట్లాడుతున్న, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు, కూటమి ఏడాది పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసగించిన తీరును ఎండగడుతూ జూన్ 4వ తేదీన 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు పిలుపునిచ్చారు. శుక్రవారం మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో కేకే రాజు అధ్యక్షతన విశాఖ ఉత్తర నియోజకవర్గం సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో వెనక్కి వెళ్లిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్రపై చంద్రబాబుకు, ఆయన తనయుడు లోకేష్‌కు చిన్నచూపు తప్ప, ఈ ప్రాంత అభివృద్ధి చేసేందుకు వారు నోచుకోలేదని మండిపడ్డారు. చంద్రబాబు, లోకేష్ విశాఖకు వచ్చిన ప్రాజెక్టులను అమరావతికి తరలించుకుపోతున్నారని, ఉత్తరాంధ్ర అభివృద్ధి కేవలం పచ్చ మీడియాలో తప్ప మరెక్కడా కనబడట్లేదని తీవ్రంగా విమర్శించారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేవరకు, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి వాటిని అమలు చేసేవరకు వైఎస్సార్‌సీపీ తరపున ప్రతీ కార్యకర్త పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, కార్పొరేటర్లు అల్లు శంకర్‌రావు, కె.అనిల్ కుమార్ రాజు, రెయ్యి వెంకటరమణ, భర్కత్ అలీ, సేనాపతి అప్పారావు, పేడాడ రమణి కుమారి, గుజ్జు వెంకటరెడ్డి, పైడి రమణ, దుప్పలపూడి శ్రీనివాసరావు, పి.సునీత, నీలి రవి, దల్లి రామకృష్ణ రెడ్డి, సప్పంగి శ్రీనివాసరావు, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, బొడ్డేటి కిరణ్, గుడ్ల అశోక్ రెడ్డి, భీశెట్టి ప్రసాద్, కర్రి రామరెడ్డి, నూకరాజు, ప్రసాద్, సదరం జ్ఞానేశ్, షేఖ్ బాబ్జి, అశోక్ రెడ్డి, బి.శ్రీనివాస్, మువ్వల సంతోష్, రాఘువులు, పద్మ శేఖర్, నాగమణి, జగదీష్, సాయి, గాలి ప్రసాద్, కోట్యాడ సూర్య, గోవింద్, భోగవల్లి గోవింద్, సారిపల్లి సంతోష్, రత్నం, అప్పారావు, సొండి సురేష్, జగదీశ్, చందనసాయి, ఈశ్వరావు పాల్గొన్నారు.

రీజినల్ లేబర్ కమిషనర్ చర్చలు వాయిదా

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమ్మెకు సంబంధించి శుక్రవారం రీజినల్ లేబర్ కమిషనర్ నిర్వహించిన చర్చలు వాయిదా పడ్డాయి. ఈ సమావేశానికి కాంట్రాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులు, యాజమాన్యం ప్రతినిధులు హాజరు కాలేదు. సమ్మె జరుగుతున్న నేపథ్యంలో చర్చలను వాయిదా వేయాలని యాజమాన్యం ఆర్ఎల్‌సీకి ఈ-మెయిల్ ద్వారా సమాచారం పంపింది. సమావేశానికి హాజరైన కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ.. సమ్మె సమయంలో యాజమాన్యం 1,480 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించిందని ఆరోపించారు. తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, భవిష్యత్తులో ఎవరినీ తొలగించకుండా చూడాలని వారు ఆర్ఎల్‌సీని కోరారు. దీనిపై స్పందించిన ఆర్ఎల్‌సీ సమావేశాన్ని జూన్ 10వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో కార్మిక సంఘాల ప్రతినిధులు ఎ. రమణ, ఎం. రవి, సోమరాజు, జాన్, ఆర్.టి. రాజు తదితరులు పాల్గొన్నారు.

నచ్చిన చోట కొలువు కోసం పైరవీలు

- కూటమి ఎమ్మెల్యేల చుట్టూ అధికారుల ప్రదక్షిణలు
- పోస్టు కోసం ఎంతైనా ఖర్చు చేసేందుకు సిద్ధం



కలెక్టర్ కార్యాలయం

మహారాణిపేట: ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలకు గడువు దగ్గర పడుతుండటంతో, తమకు నచ్చిన చోటకు పోస్టింగ్‌ల కోసం పైరవీలు ఊపందుకున్నాయి. కూటమి ప్రజా ప్రతినిధుల సిఫార్సులకోసం రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల్లోని కొంతమంది అధికారులు నిమగ్నమయ్యారు. నగరంలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న వారు అక్కడి నుంచి కదలకుండా ఉండేందుకు, అలాగే గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు నగరంలో పోస్టింగ్‌లు దక్కించుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధానంగా భీమిలి, విశాఖ రూరల్, ఆనందపురం, పెందుర్తి, సీతమ్మధార తహసీల్దార్ పోస్టులకు మంచి డిమాండ్ ఉంది. వీటిని పొందేందుకు ఎంతైనా ఖర్చు చేసేందుకు ఆరుగురు సిద్ధపడినట్లు ప్రచారం జరుగుతోంది.

నిబంధనలివీ..

జిల్లాలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగుల సాధారణ బదిలీలకు ప్రభుత్వం రంగం సిద్ధం చేయడం తెలిసిందే. ఒకే చోట ఐదేళ్లు పనిచేసిన వారికి స్థాన చలనం కల్పించాలి. మన్యం ప్రాంతాల్లో రెండేళ్లకు పైగా పనిచేసిన వారికి బదిలీల్లో ప్రాధాన్యమివ్వాలి. ఒకే చోట ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారిని తప్పనిసరిగా బదిలీ చేయడమే కాకుండా అన్ని క్యాడర్లు, పోస్టుల్లో చేసిన సర్వీసును పరిగణనలోకి తీసుకుని, ఎంత కాలం ఒకే ప్రాంతంలో పని చేశారనేది లెక్కించాలి. గిరిజన ప్రాంతాల్లో రెండేళ్లకు మించి పనిచేసిన వారికి, 40 శాతానికి మించి వైకల్యం ఉన్న ఉద్యోగులకు ధ్రువీకరణ పత్రం సమర్పిస్తే బదిలీల్లో ప్రాధాన్యమివ్వాలి.

రెవెన్యూలో సిఫార్సులకే పెద్దపీట?

ఉమ్మడి విశాఖలోని రెవెన్యూ శాఖలో అన్ని క్యాడర్లలో బదిలీలు విశాఖ కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్ చేయాల్సి ఉంది. దీనిపై ఆయన ఇప్పటికే అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి కలెక్టర్లతో సమావేశమై చర్చించారు. తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్లు, తహసీల్దార్ కార్యాలయ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, జూనియర్ అసిస్టెంట్లు, ఇతర క్యాడర్ల బదిలీలపై తుది నిర్ణయం విశాఖ కలెక్టర్ తీసుకోవాల్సి ఉంది. ఉద్యోగుల బదిలీలకు సంబంధించి ఆయన కార్యాలయానికి 68 దరఖాస్తులు వచ్చినట్లు తెలిసింది. ఇవి కాకుండా మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి కూడా సిఫార్సు లేఖలు, ఫోన్లు వచ్చినట్లు సమాచారం. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో పనిచేస్తున్న పలువురు తహసీల్దార్లు విశాఖ జిల్లాలో పోస్టింగ్‌ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో కొంతమంది నచ్చిన చోట పోస్టింగ్‌ల కోసం ఎమ్మెల్యేల సిఫార్సుల కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

జింక మృతి


మృతి చెందిన జింక

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్‌లో ఓ జింక మృతి చెందింది. శుక్రవారం ఉదయం సాగర్‌నగర్ నుంచి బీచ్‌రోడ్డు వైపు వాకింగ్‌కి వెళ్తున్న సీనియర్ సిటిజన్లు మృతి చెందిన జింకను చూసి, అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. గురువారం రాత్రి సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో జింక చనిపోయి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల కాలంలో కంబాలకొండ నుంచి తప్పిపోయిన జింకలు ఇలా జనావాసాల్లోకి వస్తున్నాయి. ఈ క్రమంలో వాహనాలు ఢీకొట్టి చనిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జింకలు మృత్యువాత పడకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

విజయనగరం వరకే రాయగడ ఎక్స్‌ప్రెస్



తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధి రాయగడ–విజయనగరం సెక్షన్‌లో జరుగుతున్న మూడో లైన్ పనుల కారణంగా ఆ మార్గంలో నడిచే పలు రైళ్లను జూన్ 2,3 తేదీల్లో రద్దు చేశారు. మరికొన్నింటిని గమ్యం కుదించడంతో పాటు రీషెడ్యూల్ చేసినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు.

రద్దు చేసిన రైళ్లు

- జూన్ 2న విశాఖపట్నం–కోరాపుట్–విశాఖపట్నం (58538 / 58537) పాసింజర్, విశాఖపట్నం–కోరాపుట్(18512) బై–వీక్లీ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–రాయ్‌పూర్–విశాఖపట్నం(58528/58527) పాసింజర్
- జూన్ 3న కోరాపుట్–విశాఖపట్నం(18511) బై–వీక్లీ ఎక్స్‌ప్రెస్

గమ్యం కుదించిన రైళ్లు

- జూన్ 1న గుంటూరు–రాయగడ(17243) ఎక్స్‌ప్రెస్ విజయనగరం వరకు మాత్రమే నడుస్తుంది. జూన్ 2న రాయగడ–గుంటూరు(17244) ఎక్స్‌ప్రెస్ విజయనగరం నుంచి బయలుదేరుతుంది.

రీషెడ్యూల్ చేసిన రైళ్లు

- జూన్1న ఎర్నాకుళం– టాటా (18190) ఎక్స్‌ప్రెస్ 3 గంటలు ఆలస్యంగా ఉదయం 10.15 గంటలకు బయలుదేరుతుంది. అలప్పుజ–ధన్‌బాద్(13352) బొకారో ఎక్స్‌ప్రెస్ 2 గంటలు ఆలస్యంగా ఉదయం 8 గంటలకు బయలుదేరుతుంది.
- జూన్ 2న దుర్గ్–విశాఖపట్నం(20829) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ నాలుగున్నర గంటలు ఆలస్యంగా ఉదయం 10.15 గంటలకు, విశాఖపట్నం–దుర్గ్(20830) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ 4 గంటలు ఆలస్యంగా రాత్రి 6.50 గంటలకు బయలుదేరుతుంది. ఈ రైళ్లు అంతే ఆలస్యంగా ఆయా స్టేషన్లకు రాకపోకలు సాగిస్తాయని, ప్రయాణికులు ఈ మార్పులను గమనించాలని డీసీఎం సూచించారు.

ఎయిడెడ్ ఆచార్యులు ఔట్

- ఏయూ నుంచి 38 మంది రిలీవ్
- కన్నీటి పర్యంతమైన మహిళా ఆచార్యులు
- పరిశోధక విద్యార్థులకు తప్పని అగచాట్లు



విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీలో ఫారిన్ సర్వీసు/డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న 38 మంది ఆచార్యులు శుక్రవారం ఇక్కడ నుంచి రిలీవ్ అయ్యారు. వైస్ చాన్సలర్ ఆదేశాలతో డిప్యూటీ రిజిస్ట్రార్(అకడమిక్) ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి పోస్టింగ్ నిమిత్తం మంగళగిరిలోని కాలేజ్ ఎడ్యుకేషన్ కమిషనరేట్ కార్యాలయంలో తక్షణమే రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో డిప్యుటేషన్‌పై పని చేస్తున్న ఆచార్యులంతా శుక్రవారం సాయంత్రం క్యాంపస్ కాలేజీ ప్రిన్సిపాళ్ల ఆమోదంతో తమ విధుల నుంచి రిలీవ్ అయ్యారు.

సాగనంపడమే లక్ష్యంగా..

రాష్ట్రంలోని వివిధ డిగ్రీ కళాశాలల నుంచి ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఫారిన్ సర్వీసు/డిప్యుటేషన్ ప్రాతిపదికన 2023 జూన్‌లో 80 మంది ఆచార్యులు వచ్చారు. అనివార్య కారణాల వల్ల 40 మంది అప్పుడే వెనక్కి వెళ్లిపోగా, ఒకరు మరణించారు. మరొకరు ఇటీవలే తమ మాతృస్థానానికి వెళ్లారు. ప్రస్తుతం 38 మంది ఆచార్యులు పనిచేస్తున్నారు. విశ్వవిద్యాలయంలో వెయ్యికి పైగా రెగ్యులర్ ఆచార్యులు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం కేవలం రెండు వందల లోపే ఉన్నారు. ప్రస్తుతం విశ్వవిద్యాలయంలో శతాబ్ది ఉత్సవాలు జరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో డిప్యుటేషన్ పై పనిచేస్తున్న సీనియర్ ఆచార్యులను ఈ సంవత్సరం కొనసాగిస్తారని అందరూ భావించారు. కానీ నాటకీయ పరిణామాల నడుమ వారందరినీ ఆగమేఘాల మీద రిలీవ్ చేయడం చర్చనీయాంశంగా మారింది.

అగౌరవంగా.. అవమానకరంగా..

డిప్యుటేషన్ పై వచ్చిన ఆచార్యులను ఏయూ నుంచి పంపించేస్తారని ఇటీవల జోరుగా ప్రచారం జరిగింది. దీనిపై కలత చెందిన కొంత మంది ఆచార్యులు మూడు రోజుల కిందట వీసీని కలిసి తమ ఇబ్బందులను చెప్పుకున్నారు. పిల్లల చదువుల దృష్ట్యా ఈ సంవత్సరం కొనసాగించాలని, విశ్వవిద్యాలయం వంద ఏళ్ల ఉత్సవాల్లో భాగస్వాములయ్యే అవకాశం కల్పించాలని విన్నవించినట్లు తెలిసింది. అదే సమయంలో కూటమికి చెందిన కొంతమంది ప్రజా ప్రతినిధులను కూడా కలిసిన ప్పటికీ, ఉన్నట్టుండి రిలీవ్ చేయడంతో డిప్యుటేషన్ పై వచ్చిన ఆచార్యులు షాక్‌కు గురయ్యారు. వర్సిటీ నాక్ గ్రేడ్ సాధించడంలో ఎంతో కీలకంగా పనిచేసిన తమను ఇలా అగౌరవంగా, అవమానకరంగా రిలీవ్ చేయడంపై కొంతమంది మహిళా ఆచార్యులు వర్సిటీ పెద్దల ముందు కన్నీటి పర్యంతమైనట్లు తెలిసింది.

రీసెర్చ్ స్కాలర్ల దారెటు?

డిప్యుటేషన్ పై వచ్చిన వారంతా సీనియర్ ఆచార్యులు కావడంతో విశ్వవిద్యాలయంలో పరిశోధక విద్యార్థులకు మార్గదర్శకులుగా వ్యవహరిస్తున్నారు. ఇలా ఒక్కో ఆచార్యుని వద్ద నలుగురు లేదా ఐదుగురు పరిశోధక విద్యార్థులు పరిశోధనలు చేస్తున్నారు. ప్రస్తుతం 38 మంది ఆచార్యులను వర్సిటీ నుంచి రిలీవ్ చేయడంతో.. ఇప్పటివరకు వారి మార్గదర్శకత్వంలో ఉన్న పరిశోధక విద్యార్థుల పరిస్థితి ఏమిటనేది తేలాల్సి ఉంది. గైడ్ షిప్ మారే క్రమంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వర్సిటీ అధికారులు వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని పరిశోధక విద్యార్థులు కోరుతున్నారు.

10న విశాఖలో రాష్ట్రపతి పర్యటన

పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశం


రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, చిత్రంలో వర్సిటీ వీసీ కట్టమణి

మహారాణిపేట: నగరంలో జూన్ 10వ తేదీన జరగనున్న కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విచ్చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్ మీటింగ్ హాలులో శుక్రవారం గిరిజన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ టి.వి.కట్టిమణితో కలిసి వివిధ అంశాలపై సమీక్షించిన కలెక్టర్.. కార్యక్రమ నిర్వహణపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రపతి జూన్ 10వ తేదీ ఉదయం 11.30 గంటలకు విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుని.. అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాలుకు చేరుకుంటారు. అక్కడ జరిగే కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు జరిగే కార్యక్రమం అనంతరం, ఆమె రోడ్డు మార్గం ద్వారా విమానాశ్రయానికి చేరుకుని తిరిగి ప్రయాణం అవుతారు. ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండి పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. రోడ్డు మార్గంలో రానున్న నేపథ్యంలో సుందరీకరణ పనులు, మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. జ్ఞానాపురం రైల్వే అండర్ పాస్ వద్ద నీరు నిలిచిపోకుండా చర్యలు చేపట్టాలని, ఒకవేళ వర్షం పడినట్లయితే మోటార్ల ద్వారా నీటిని తొలగించాలని జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఐఎన్ఎస్ డేగా నుంచి కన్వెన్షన్ హాలు వరకు ఎలాంటి హోర్డింగులు, విద్యుత్ తీగలు, ఇతర అడ్డంకులు లేకుండా తొలగించాలని సూచించారు. రాష్ట్రపతితో పాటు గవర్నర్, ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి రానున్న క్రమంలో ప్రత్యేక గ్రీన్ రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలని, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డీసీపీలు అజిత, మేరీ ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డీఆర్వో బిహెచ్ భవానీ శంకర్, ఆర్డీవోలు పి.శ్రీలేఖ, సంగీత్ మాథుర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు అన్యాయం

- కలెక్టర్‌ను కలిసిన సీపీఎం నాయకులు
- తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి

మహారాణిపేట: 'విశాఖ ఉక్కు కర్మాగారంలో ఈ నెల 20 నుంచి జరుగుతున్న నిరవధిక సమ్మెలో పాల్గొన్నారనే కారణంతో 1,470 మంది కాంట్రాక్ట్ కార్మికులను యాజమాన్యం కర్కశంగా బయోమెట్రిక్ నుంచి తొలగించి వారిని గేటు బయట నిలిపివేసింది.' అని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం జగ్గు నాయుడు, 78వ వార్డు కార్పొరేటర్ బి గంగారావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పి.వెంకట్ రెడ్డి ఆరోపించారు. ఈ చర్యను తీవ్రంగా ఖండించిన నేతలు.. తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూర్మన్నపాలెంలోని ఉక్కు దీక్ష శిబిరంలో నిరసన తెలుపుతున్న కార్మికులకు పోలీసులు ఆటంకాలు కలిగిస్తున్నారని ఆరోపించారు. ఈ చర్యలను వెంటనే నిలిపివేయాలని కోరుతూ శుక్రవారం సీపీఎం ప్రతినిధి బృందం కలెక్టర్ ఎం.ఎన్.హరేందిరప్రసాద్‌ను వినతిపత్రం సమర్పించింది. పోలీసులు వేధింపులకు పాల్పడుతున్నారని, స్టీల్ ప్లాంట్ అధికారులు కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని కలెక్టర్‌కు వివరించారు. మూడు దశాబ్దాలుగా స్టీల్ ప్లాంట్ ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు తమ ఉపాధి, హక్కుల పరిరక్షణ కోసం ఈ నెల 20 నుంచి తప్పనిసరి పరిస్థితుల్లో నిరవధిక సమ్మె ప్రారంభించారన్నారు. వేలాది మంది కార్మికులను అకారణంగా తొలగిస్తుంటే, తమ కుటుంబాలను కాపాడాలని వారు అధికారులకు, ప్రజాప్రతినిధులకు అనేకసార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోయిందన్నారు. సమ్మె చేస్తున్న కార్మికులను, వారికి మద్దతు తెలుపుతున్న కార్మిక నాయకులపై పోలీసులు అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని కార్పొరేటర్ గంగారావు ఆరోపించారు.

శాంతియుతంగా సమ్మె చేస్తున్న కార్మికులను యాజమాన్యం బెదిరింపులకు గురిచేస్తోందన్నారు. గతంలో తొలగించిన 2,500 మంది కార్మికులకు అదనంగా సమ్మెలో పాల్గొన్నారనే కక్షతో మరో 1,470 మంది కార్మికులను తొలగించడం అన్యాయమని వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ చర్యల వల్ల వారి కుటుంబాలు పడతాయని, తొలగించిన 1,470 మంది కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని.. స్టీల్ ప్లాంట్ యాజమాన్యం, పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు జగ్గు నాయుడు తెలిపారు.

6న జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం

విశాఖ సిటీ: జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం జూన్ 6వ తేదీన జరగనుంది. ఆ రోజు ఉదయం 11 గంటలకు జీవీఎంసీ సర్వసభ్య సమావేశ మందిరంలో మేయర్ పీలా శ్రీనివాసరావు అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో చర్చించేందుకు 27 అంశాలతో కూడిన అజెండాను సిద్ధం చేశారు. వీటితో పాటు మరికొన్ని అంశాలతో టేబుల్ అజెండాకు కూడా రూపకల్పన చేస్తున్నట్లు సమాచారం.

అజెండాలోని కొన్ని ముఖ్యాంశాలు

విద్యుత్ విభాగం: ఆప్కోస్ విధానంలో పనిచేస్తున్న 31 మంది టెక్నికల్, నాన్–టెక్నికల్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఎలక్ట్రికల్ హెల్పర్ల సేవలను 2025–26 సంవత్సరానికి పొడిగింపు..

స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు: పీపీపీ (పబ్లిక్–ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్) విధానంలో 15 మెగావాట్ల ఫ్లోటింగ్/ల్యాండ్ బేస్డ్ సోలార్ ప్లాంట్ల అభివృద్ధి.

76వ వార్డు అభివృద్ధి: గోపాల్‌రెడ్డినగర్‌లో రూ. 1.96 కోట్లతో వీఆర్‌సీసీ డ్రైన్ అభివృద్ధి.

97వ వార్డు అభివృద్ధి: చినముషిడివాడ శ్రమశక్తినగర్‌లో రూ. 1.85 కోట్లతో థీమ్ పార్క్ అభివృద్ధి.

తృప్తి క్యాంటీన్లు: సారా ప్రాజెక్ట్స్ ద్వారా 'వన్‌ఫ్యామిలీ–వన్ ఎంటర్‌ప్రెన్యూర్' పథకం కింద గుర్తించిన ప్రభుత్వ స్థలంలో తృప్తి క్యాంటీన్ల ఏర్పాటు.

90వ వార్డు నిర్మాణాలు: ఎన్ఏడీ ఫ్లైఓవర్ పక్కన యునైటెడ్ క్రైస్ట్ చర్చి నుంచి గాంధీనగర్ వరకు రూ. 67.65 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైన్ల నిర్మాణం.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం: 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 1.55 కోట్లతో కొత్త అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణం.

ఉపాధి మార్గాల ద్వారా ఆర్థిక స్వావలంబన

మహారాణిపేట: వివిధ స్వయంశక్తి ఉపాధి మార్గాల ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించవచ్చని కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ కార్యదర్శి వివేక్ భరద్వాజ్ అన్నారు. శుక్రవారం రుషికొండలోని రాడిసన్ బ్లూలో జరిగిన వర్క్‌షాప్‌లో ఆయన ప్రసంగించారు. దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వంతో కూడిన లాభదాయకమైన ప్రాజెక్టుల రూపకల్పన అవసరమని భరద్వాజ్ చెప్పారు. కార్యక్రమంలో కేంద్ర పీఆర్ జాయింట్ సెక్రటరీ ముక్తా శేఖర్, ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్, కమిషనర్ కృష్ణతేజ, జెడ్పీ సీఈవో పి. నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.రూ. 50 లక్షలకు పైగా సొంత ఆదాయం కలిగిన రాష్ట్రంలోని ఎన్నికైన పంచాయతీల ప్రతినిధులు, రూ. కోటి కంటే ఎక్కువ ఆర్థిక స్వావలంబన సాధించిన బ్లాక్ పంచాయతీల (మండల ప్రజా పరిషత్‌లు) ప్రతినిధులు, ఎంపీడీవోలు, ఇతర అధికారులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఎంపిక చేసిన 88 మంది సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక ముఖాముఖి నిర్వహించారు. తొలుత పలు రాష్ట్రాల పంచాయతీరాజ్ అధికారులతో కేంద్ర సాధికార కమిటీ, కార్యదర్శి వివేక్ భరద్వాజ్ చర్చించారు. ఆంధ్రప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, మేఘాలయ, నాగాలాండ్ రాష్ట్రాలతో కూడిన పంచాయతీ రాజ్ అధికారులతో కూడా చర్చలు జరిపారు. రాష్ట్రీయ గ్రామ్ స్వరాజ్ అభియాన్ కింద చేపడుతున్న ప్రాజెక్టులు, ఇతర కార్యకలాపాలపై చర్చ జరిగింది.

పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం

మహారాణిపేట: పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే ఔత్సాహికులకు అన్ని విధాలుగా పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షత న జరిగిన జిల్లా ఇండస్ట్రియల్ ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశంలో ఆయన ఈ సూచనలు చేశారు. గత సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న చర్యలపై అధికారులతో సమీక్షించిన కలెక్టర్, పరిశ్రమలు నెలకొల్పే వారికి అధికారులు సంపూర్ణ సహకారం అందించాలని తెలిపారు. ఔత్సాహికులు, అధికారులు సమన్వయంతో పనిచేసి, వీలైనన్ని పారిశ్రామిక యూనిట్లను జిల్లాలో నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం నడుస్తున్న పారిశ్రామిక కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉంటే త్వరగా పరిష్కరించాలని, అక్కడి నుంచి వచ్చే వినతులపై వేగంగా స్పందించి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. వనరులను సద్వినియోగం చేసుకుంటూ పారిశ్రామికంగా అభివృద్ధి సాధించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో గంగవరం పోర్టు నుంచి నేషనల్ హైవే రోడ్డు కనెక్టివిటీ, ఏపీఐఐసీ ఇండస్ట్రీస్‌లో 30 వ్యక్తిగత యూనిట్లకు వాటర్ ట్యాక్స్, ఏపీఐఐసీ, ఐలా, ఆటోనగర్, మధురవాడ ఐటీ పార్క్ వద్ద బస్టాపుల ఏర్పాటు, ఏపీఐఐసీ, ఐలా, ఆటోనగర్ వద్ద ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రైవేటు భారీ వాహనాల పార్కింగ్, పీఎం విశ్వకర్మ యోజన పథకం, సింగిల్ విండో క్లియరెన్స్ వంటి పలు అంశాలపై చర్చించి, అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ వి. ఆదిశేషు, వివిధ పరిశ్రమల నిర్వాహకులు, ఐలా ప్రతినిధులు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చెల్లెళ్లు ఆటపట్టించడంతో అక్క ఆత్మహత్య


కిరణ్మయి(ఫైల్)

మద్రిపాలెం: జ్ఞానాపురం గెడ్డ వీధికి చెందిన 10వ తరగతి విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. కంచరపాలెం పోలీసులు తెలిపిన వివరాలివి.. కిరణ్మయి (15) తల్లిదండ్రులు, చెల్లెళ్లతో కలిసి నివాసం ఉంటోంది. ఇటీవల పదో తరగతి పరీక్షల్లో ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించింది. అయితే బాలికను చెల్లెళ్లు నిత్యం ఏదో ఒక విషయంపై ఆటపట్టిస్తుండటంతో.. శుక్రవారం ఇంట్లో ఉన్న బాత్రూమ్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆ సమయంలో తల్లిదండ్రులిద్దరూ ఇంట్లో లేరు. కొంతసేపటికి ఆమె తాత ఇంటికి రావడంతో, అక్క ఎక్కడికో వెళ్లిపోయిందని వారు అతనికి చెప్పారు. అంతా వెతికి, చివరికి బాత్రూమ్ తలుపులు పగలగొట్టి చూడగా, కిరణ్మయి విగతజీవిగా కనిపించింది. వెంటనే కంచరపాలెం పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కాగా బాలిక తండ్రి ఎండాడలో వెల్డింగ్ పనులు చేస్తుండగా, తల్లి గౌరి నగరంలో ఓ వస్త్ర దుకాణంలో పని చేస్తున్నారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అతివేగమే ఆయువు తీసింది

- ఫ్లై ఓవర్‌పై ఘోర ప్రమాదం
- ఇద్దరు యువకుల దుర్మరణం


ఎలక్ట్రిక్ వాహనం

అల్లిపురం: అతివేగం ఇద్దరు యువకుల ఆయువు తీసింది. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి తెలుగుతల్లి ఫ్లైఓవర్‌పై గురువారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో ఈ దుర్ఘటన జరిగింది. టూటౌన్ సీఐ ఎం.శ్రీను, ఎస్ఐ కె.శ్రీలక్ష్మి తెలిపిన వివరాలివి. గోపాలపట్నం సమీపంలోని నరసింహనగర్‌కు చెందిన ఎస్. ప్రసన్నకుమార్, అతని స్నేహితుడు సాయి కిరణ్ బుధవారం రాత్రి 11.30 గంటలకు ఎలక్ట్రిక్ స్కూటర్‌పై వైఎంసీఏ ఎదురుగా బీచ్‌కు వెళ్లారు. తిరిగి తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో తెలుగుతల్లి ఫ్లైఓవర్ మీదుగా రైల్వేస్టేషన్ వైపు ప్రయాణిస్తుండగా.. డీఆర్ఎం కార్యాలయం సమీపంలోని మలుపు వద్ద వాహనం అదుపు తప్పింది. అతివేగంగా ఉండటం వల్ల వాహనాన్ని నియంత్రించలేకపోయారు. దీంతో వారు మధ్య డివైడర్‌పై ఉన్న పూలకుండీని బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ప్రసన్నకుమార్, సాయి కిరణ్‌లు ఒకరు డివైడర్‌పై, మరొకరు రోడ్డుపై పడిపోయారు. తలకు తీవ్రమైన గాయాలు కావడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందారు. అటుగా వెళ్తున్న వాహనదారులు ప్రమాదాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. టూటౌన్ ట్రాఫిక్ సీఐ ఎం.శ్రీను సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అప్పటికే మృతి చెందిన యువకుల మృతదేహాలను పోస్టుమార్టం కోసం కేజీహెచ్ మార్చురీకి తరలించారు. ప్రసన్నకుమార్ తండ్రి ఎస్.వెంకట అప్పలరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన నరసింహనగర్‌లో తీవ్ర విషాదాన్ని నింపింది.



ప్రసన్నకుమార్, సాయికిరణ్ మృతదేహాలను పరిశీలిస్తున్న సీఐ శ్రీను

పొగ.. జీవితాలకు సెగ



- దృఢ సంకల్పంతో వ్యసనానికి దూరం కావొచ్చు
- నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం



దాబాగార్డెన్స్: సిగరెట్.. గుట్కా.. పాన్ మసాలా వంటి పొగాకు ఉత్పత్తుల వినియోగం ఎన్నో అనార్థాలకు, అనారోగ్యాలకు కారణం. ఈ చేదు నిజాన్ని గ్రహించే లోపే.. సిగరెట్ పొగలా మన ప్రాణాలు గాలిలో కలిసిపోయే ప్రమాదం ఉంది. దృఢ సంకల్పంతో ఈ వ్యసనాన్ని దూరం చేసుకోవచ్చు. మన ఆరోగ్యంతో పాటు మన చుట్టూ ఉన్న వారి శ్రేయస్సు కోసం ఈ మహమ్మారిపై పోరాడాల్సిన అవసరం ఉంది. నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం.

పొగాకును ఏ రూపంలో తీసుకున్నా అది ప్రమాదకరమే. దీని వల్ల కలిగే అనర్థాలు అన్నీ ఇన్నీ కావు. ఒక సిగరెట్‌లో 400 పైగా హానికరమైన రసాయనాలు ఉంటాయి. వీటి లో 48కి పైగా క్యాన్సర్ కారకాలున్నాయని పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. ఈ రసాయనాలు ఊపిరితిత్తులు, గొంతు, నాలుక వంటి భాగాలకు అతి సులువుగా క్యాన్సర్‌ను కలిగిస్తాయి. గర్భిణులు ధూమపానం చేస్తే, కడుపులోని శిశువు సున్నితమైన అవయవాలపై తీవ్ర దుష్ప్రభావం పడుతుంది. ధూమపానం చేసే వారు తమ చుట్టూ ఉన్నవారి ఊపిరితిత్తుల్లోకి దాదాపు 25 శాతం విష వాయువులను ఉచితంగా పంపి.. వారి అనారోగ్యానికి కారణమవుతున్నారు. ఆర్థికంగా చితికిపోయి, అనారోగ్యంతో మంచానపడి జీవితం దుర్భరంగా మారుతుంది.

చేయి చేయి కలుపుదాం

పొగతాగడం వల్ల కొత్త జబ్బులు వస్తున్నాయి. శారీరక రోగాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక సమస్యల వలనే చాలా మంది పొగాకుకు బానిసలవుతున్నారు. ఈ అలవాటు మానేందుకు చాలా మంది ఇష్టపడడం లేదు. మందులు వాడినా మెడిటేషన్ చాలా ముఖ్యం. పొగాకు మహమ్మారి నుంచి మనల్ని మనం రక్షించుకోవడమే కాకుండా.. మన చుట్టూ ఉన్న వారికి ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

– డాక్టర్ సునీల్‌కుమార్, చెస్ట్ ఫిజీషియన్, ప్రభుత్వ ఛాతి ఆసుపత్రి

వ్యసనం నుంచి విముక్తికి మార్గాలివే..

- ధూమపానం అలవాటు ఉంటే సిగరెట్లు, బీడీలు, చుట్టలు, గుట్కా వంటి పొగాకు ఉత్పత్తులను దగ్గర ఉంచుకోవద్దు.
- పొగాకు తీసుకునే అలవాటున్న వ్యక్తులకు కొంతకాలం దూరంగా ఉండండి.
- పొగాకును పూర్తిగా వదిలేసినప్పుడే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమనే నిజాన్ని గుర్తుంచుకోండి.
- ధూమపానం చేయాలనిపించినప్పుడు లవంగాలు, యాలకులు వంటివి నోట్లో వేసుకుంటే తాత్కాలికంగా కోరిక తగ్గుతుంది.
- ఆరంభంలో నాలుగు వారాలు, ఆపై ఆరు నెలల పాటు పైన చెప్పిన జాగ్రత్తలు పాటిస్తూ క్రమంగా ఈ దురలవాటు నుంచి శాశ్వతంగా బయటపడవచ్చు.
- ఆధ్యాత్మిక జీవనశైలిని అలవర్చుకోవడం, ధ్యానం చేయడం ద్వారా మనశ్శాంతి, మనోబలం, సహనశక్తి పెరుగుతాయి. తద్వారా వ్యసనాలపై ఏకాగ్రత తగ్గి, వాటిపై విరక్తి కలుగుతుంది.
- ప్రతిరోజూ వ్యాయామం, ఆటలు ఆడటం వంటి వాటికి సమయం కేటాయించడం వల్ల మెదడు చురుగ్గా పనిచేస్తుంది. ఇది సిగరెట్ తాగాలనే కోరికను తగ్గిస్తుందని నిపుణులు సూచిస్తున్నారు.

మానేస్తే ప్రయోజనాలివే..

- పొగాకు సేవించడం మానేసిన వెంటనే మీ శరీరంలో సానుకూల మార్పులు మొదలవుతాయి.
- కేవలం 12 గంటల్లోనే రక్తంలో ఆక్సిజన్ స్థాయిలు మెరుగుపడి చక్కని అనుభూతి కలుగుతుంది. లోతైన శ్వాస తీసుకోవడం సులభమవుతుంది.
- రెండు రోజుల తర్వాత ఆహారం రుచిగా అనిపించడం మొదలవుతుంది, వాసన గ్రహించే శక్తి పెరుగుతుంది.
- కొన్ని వారాల్లో దగ్గు, ఆయాసం తగ్గుతాయి. ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపడుతుంది.
- గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి ప్రమాదాలు గణనీయంగా తగ్గుతాయి.

మెరిసేవన్నీ 'అక్షయ పాత్రలు' కావు

- అక్షయ పాత్ర, రైస్ పుల్లింగ్ పేరిట మోసాలకు పాల్పడిన ముఠా అరెస్టు
- పది మందిని రిమాండ్‌కు తరలించినట్లు అదనపు ఎస్పీ, డీఎస్పీల వెల్లడి

శ్రీకాకుళం క్రైమ్: 'అక్షయపాత్ర', 'రైస్ పుల్లింగ్' పేరిట మోసాలకు పాల్పడుతున్న 10 మంది సభ్యుల ముఠాను సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస సమీపంలో అరెస్టు చేసినట్లు అదనపు ఎస్పీ కేవీ రమణ, డీఎస్పీ సీహెచ్ వివేకానంద శుక్రవారం తెలిపారు. ఈ ముఠాలోని నిందితులంతా విశాఖపట్నం మధురవాడకు చెందిన పచ్చితల రవిశంకర్, అతని స్నేహితుడు రుద్రరాజు వెంకటరంగరాజు, పెద గంట్యాడకు చెందిన కనకరాజు, నరసన్నపేట మండలం కిళ్లాంకు చెందిన నక్కిన రఘునాథ రావు, తిరుపతి జిల్లా చిన్న గొట్టికల్లు మండలం చట్టివారిపాలెంకు చెందిన గట్టిక్కుల మురళీకృష్ణ, హైదరాబాద్ బహదూర్పూరా రామనస్పూరకు చెందిన గరిక శ్రీను, కాకినాడ జిల్లా పిఠాపురం అగ్రహారానికి చెందిన కొండ శ్రీవెంకట నాగసత్యనారాయణ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుండేవారు. కరోనా సమయంలో వ్యాపారం దెబ్బతినడంతో సులభంగా డబ్బు సంపాదించేందుకు ఈ మోసాలకు పాల్పడినట్లు తెలిపారు. నిందితుల్లో ఒకరైన రవిశంకర్‌కు గతంలో కూడా ఇదే తరహా కేసులో ప్రమేయం ఉంది. వీరు రూ.1600 విలువ చేసే అక్షయ పాత్రను రూ.25 లక్షలకు బేరం కుదుర్చుకొని, దాన్ని మరొకరికి రూ.50 లక్షలకు అమ్మేందుకు కూడా సిద్ధమయ్యారని విచారణలో తేలింది. మోసాలకు పాల్పడుతున్నారనే సమాచారం అందుకున్న పోలీసులు, వెన్నెలవలస రిజర్వాయర్ సమీపంలోని పాడుబడిన బంగ్లాలో క్రయవిక్రయాలు జరుపుతుండగా నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి మూడు కార్లు, రూ.5 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసును చాకచక్యంగా ఛేదించిన ఆమదాలవలస సీఐ సత్యనారాయణ, ఎస్ఐ హైమావతి, ఇతర సిబ్బందిని అదనపు ఎస్పీ రమణ అభినందించారు.